క్లుప్తంగా

ఎన్జీవో అధ్యక్షుడిగా శ్రీకాంత్‌రెడ్డి

ముద్దనూరు : ముద్దనూరు తాలూకా ఎన్జీవో అధ్యక్షుడిగా శ్రీకాంత్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం ముద్దనూరులో జరిగిన ఎన్నికలకు ఎన్నికల అధికారిగా బ్రహ్మానందరెడ్డి వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా శ్రీకాంత్‌రెడ్డి, సహ అధ్యక్షుడిగా రమణయ్య, ఉపాధ్యక్షులుగా షేక్ యాసీన్, రాజశేఖర్‌నాయుడు, ప్రసాద్‌రెడ్డి ఎన్నిక కాగా కార్యదర్శిగా ఎం.జాషన్, సంయుక్త కార్యదర్శిగా అనిల్‌కుమార్‌రెడ్డి, విశాలక్ష్మి, పరమేశ్వరి, ఓబులేసులు, కోశాధికారిగా డాక్టర్ కరిస్మా, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రామారావులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రసాద్‌యాదవ్, జిల్లా కార్యదర్శి రవికుమార్‌లు పాల్గొన్నారు.

విద్యార్థుల శ్రమదానం



పిచ్చిమొక్కలను తొలగిస్తున్న విద్యార్థులు

చింతకొమ్మదిన్నె : స్థానిక అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం చింతకొమ్మదిన్నెలోని మండల రెవెన్యూ కార్యాలయం, మండల ఆరోగ్య కేంద్రం, మోడల్ స్కూలు, కోదండరామాలయం పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. పరిసరాల్లో ఉన్న పిచ్చి మొక్కలను, ప్లాస్టిక్ కవర్లను తొలగించడంతోపాటు అక్కడ సమీప ప్రాంతంలో ఉన్న గ్రామీణ ప్రజలకు పరిసరాలు–పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల డిప్యూటీ తహసీల్దార్ రోనాల్డ్, మండల అధికారులు కళాశాల హెచ్‌ఎస్ విభాగాధిపతి డాక్టర్ కేఏస్ శశి కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ టి.శంకర్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బిడ్డకు ముర్రుపాలను తాపించాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభద్ర

వేంపల్లె : బిడ్డ పుట్టిన గంటలోపు తల్లి ముర్రుపాలను తాపించాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సుభద్ర తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని నందిపల్లె, అలవలపాడు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ముర్రు పాలపై గర్భిణులకు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డకు తల్లి పాలే అత్యంత శ్రేయస్కరమన్నారు. తల్లిపాలు బిడ్డలకు అంటువ్యాధులు, అసంక్రమిత వ్యాధులను దూరం చేస్తాయన్నారు. కార్యక్రమంలో హెల్త్ డిప్యూటీ సూపర్ వైజర్ షఫీ ఉన్నిసా, ఆరోగ్య కార్యకర్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయపడ్డ చౌడయ్య

వల్లూరు : కడప–తాడిపత్రి ప్రధాన రహదారి వాహిద్ నగర్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. ఖాజీపేట మండలం అప్పనపల్లెకు చెందిన చౌడయ్య ఎర్రగుంట్లలో జరిగిన ఓ వివాహ వేడుకలో పాల్గొని ద్విచక్ర వాహనంలో కడప వైపుకు ప్రయాణిస్తూ వాహిద్ నగర్ వద్ద రాగా కమలాపురం వైపుకు వస్తున్న ఆర్‌టీసీ బస్సు వెనుక భాగంలో ఢీ కొట్టాడు. దీంతో కిందపడ్డ అతడు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు చికిత్స కోసం అతన్ని కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

ఆకట్టుకున్న మా ఎగ్జిబిషన్



మా ఎగ్జిబిషన్ అండ్ సేల్స్‌లో కొనుగోలుదారుల సందడి

కడప కోటిరెడ్డిసర్కిల్ : మహిళలను మా ఎగ్జిబిషన్ అండ్ సేల్ ఆకట్టుకుంది. బుధవారం ఎగ్జిబిషన్ నిర్వాహకులు కడప నగరం ప్రకాశ్‌నగర్‌లో గల తమ ఎగ్జిబిషన్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. 92.5 ప్యూర్ సిల్వర్ జ్యువెలరీ, ప్యూర్ బెనారస్ పట్టు, వెంకటగిరి పట్టు, కంచి పట్టు, ప్యూర్ జ్యామ్‌దాని శారీస్, ఫ్యాన్సీ శారీస్, జ్యామ్‌దాని డ్రస్ మెటీరియల్, బెడ్‌షీట్స్, దివాన సెట్స్, ఫ్యాబ్రిక్స్ తమ ప్రత్యేకతలన్నారు. ప్రజల ఆదరణకు మరోమారు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని వివరించారు. భవిష్యత్తులో కూడా మరింత మెరుగైన వస్త్రాలు, ఆభరణాలతో కూడిన ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తామని వారు వివరించారు.







పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో భాగంగా పులివెందుల మండలం కనుమపల్లెలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీ నాయకులు

రైతులకు సకాలంలో ఎరువులను పంపిణీ చేయాలి



రైతులతో మాట్లాడుతున్న జేడీఏ చంద్రనాయక్

లింగాల : రైతులకు సకాలంలో ఎరువులను పంపిణీ చేయాలని వ్యవసాయ శాఖ జేడీ చంద్ర నాయక్ తెలిపారు. మురారిచింతల రైతు సేవా కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి గ్రామ రైతులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా జేడీఏ వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అందుతున్న సేవల గురించి ఆరా తీస్తూ మోతాదుకు మించి యూరియా వాడితే భూమి సారవంతం కోల్పోతుందన్నారు. ఆర్‌ఎస్‌కే సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ ఆ గ్రామంలో పండించే విధంగా రకాల పంటల సాగులో సస్యరక్షణ చర్యలు, చీడ, పీడల నివారణ గురించి తెలియజేయాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన ప్రతి పంట కూడా ఇ క్రాప్ బుకింగ్ చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రమేష్, రైతు సేవా కేంద్ర సిబ్బంది శర్ఫుద్దీన్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు పాటించాలి



మాట్లాడుతున్న ఏఓ సరస్వతి

కమలాపురం : రైతులు తాము సాగు చేస్తున్న పంటలకు వ్యవసాయ అధికారులు సూచిస్తున్న సస్యరక్షణ చర్యలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వనరుల శాఖ ఏడీఏ అశోక్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని పందిళ్లపల్లె, ఎర్రగుడిపాడు గ్రామాలలో జరిగిన పొలం పిలుస్తోంది.. కార్యక్రయానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వేరుశనగ తదితర పంటలను క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు సస్యరక్షణ చర్యలు, అధికారులు ఇచ్చే సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. పురుగు, తెగుళ్ల మందులతో విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. రసం పీల్చే పురుగుల ఉధృతిని తగ్గించుటకు లేదా తెలుసుకొనుటకు ఏకరాకి 20 చొప్పున జిగురు అట్టలను వాడాలన్నారు. అలాగే ఏకరాకు 4 చొప్పున లింగాకర్షక బుట్టలు పెట్టినట్లయితే పురుగుల ఉధృతిని తెలుసుకోవచ్చన్నారు. తద్వారా పురుగు మందుల వాడకాన్ని అవసరం చొప్పున రైతులు పిచికారి చేసుకోవచ్చన్నారు. ఏఓ సరస్వతి మాట్లాడుతూ ఆరుతడి పద్ధతిలో వరి పంటను సాగు చేయడం ద్వారా అధిక ఉత్పత్తులు సాధించవచ్చన్నారు. అలాగే ఉల్లి, వరి, కంది తదితర పంటలకు బీమా చేసుకోవడానికి ఈ నెల 14 వరకు గడువు పెంచారని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పులివెందుల వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపించండి



డేనియల్ ప్రదీప్

కడప కార్పొరేషన్ : పులివెందుల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెడ్పీటీసీ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ నాయకులు, శాప్ మాజీ డైరెక్టర్ ఎం.డేనియల్ ప్రదీప్‌కుమార్ కోరారు. బుధవారం ఆయన కడపలో మీడియాతో మాట్లాడారు. వైఎస్ కుటుంబానికి కంచుకోటగా ఉన్న పులివెందులలో కుట్ర చేసి గెలవడానికి కొంత మంది ప్రయత్నం చేస్తున్నారని అయితే ఓటర్లు మాత్రం కూటమి నాయకులకు తగిన రీతిలో బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. వైఎస్ కుటుంబం పులివెందుల ప్రాంతాన్ని ఎంత అభివృద్ధి చేసిందో పులివెందుల ప్రజలకు బాగా తెలుసన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయలేక అబద్ధాలతో కాలయాపన చేస్తోందని విమర్శించారు. మాట తప్పని, మడమ తిప్పని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కుమారుడుగా రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతంలో అనేక సంక్షేమ పథకాలను అందించారని తెలిపారు. పులివెందుల జడ్పీటీసీ అభ్యర్థిని గెలిపించి కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. ఈ ఉప ఎన్నికలు కూటమి ప్రభుత్వం అవినీతి, అక్రమాలకు, వైఎస్సార్‌సీపీ నీతి, నిజాయితీలకు మధ్య జరిగే పోటీగా ఆయన అభివర్ణించారు.

విద్యా శాఖ ఉత్తర్వులను వెనక్కు తీసుకోవాలి

కమలాపురం : పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు తప్ప ఇతరులకు ప్రవేశం లేదని విద్యా శాఖ ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ ఏరియా కమిటీ అధ్యక్ష, కార్యదర్శిలు రాఘవ, సాదిక్‌లు డిమాండ్ చేశారు. బుధవారం కమలాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విద్యా శాఖ జారీ చేసిన ఉత్తర్వులు కార్పొరేట్ విద్య వ్యాపారులకు అనుకూలంగా ఉంటాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టళ్లలో ఏ సంఘటనలు జరిగినా కూడా బయటకు పొక్క కుండా ఉండేందుకే ఈ ఉత్తర్వులు ప్రభుత్వం జారీ చేసిందని వారు మండి పడ్డారు. హాస్టళ్లలో విద్యార్థులకు ఏ కష్టం వచ్చినా తల్లిదండ్రుల కన్నా ముందుగా వెళ్లేది విద్యార్థి సంఘాల నాయకులేనని వారు స్పష్టం చేశారు. ఏ సంఘటనలు జరిగినా కప్పిపుచ్చుకోవడం కోసమే ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసిందని, తక్షణం వాటిని వెనక్కు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తోనే కుటుంబాలు విచ్ఛిన్నం



మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రశేఖరరావు

పులివెందుల టౌన్ : డ్రగ్స్‌తోనే కుటుంబాలు విచ్ఛిన్నం కావడంతోపాటు పిల్లల భవిష్యత్ ప్రశ్నార్థకమని ఎంఈఓ చంద్రశేఖర్‌రావు తెలిపారు. పట్టణంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో పాఠశాల హెడ్మాస్టర్ గంగిరెడ్డి అధ్యక్షతన మాదక ద్రవ్యాల నివారణపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాల గురించి నిరంతరం చర్చించుకుంటూ మాదక ద్రవ్యాల నివారణ కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం సేవా సమితి అధ్యక్షుడు రాజు, విద్యార్థుల చేతులమీదుగా మాదక ద్రవ్యాలవలన కలిగే అనర్థాలను తెలియజేసే పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సుమలత, ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వీఆర్‌ఏలతో పోస్టులు భర్తీ చేయాలి



మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రశేఖరరావు

జమ్మలమడుగు : డివిజన్ పరిధిలో 15 సంవత్సరాలుగా ఎమ్మార్వో, ఆర్డీఓ కార్యాలయాల్లో వాచ్‌మెన్, అటెండర్, రికార్డు అసిస్టెంట్, డ్రైవర్ లాంటి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సంవత్సరాలు గడుస్తున్నా వీటిని అధికారులు భర్తీచేయడంలేదు. ఎన్నో సంవత్సరాలుగా గ్రామాల్లో వీఆర్‌ఏలుగా విధులు నిర్వహిస్తున్న తమతో ఈ పోస్టులను భర్తీచేయాలని ఏపీ రెవెన్యూ సహాయకుల సంఘం నాయకుడు వై.జయరాజు ఆధ్వర్యంలో ఆర్డీఓ సాయిశ్రీకి వినతి పత్రం అందజేశారు. బుధవారం రెవెన్యూ సహాయ సంఘం నాయకులు ఆర్డీఓ కార్యాలయంలో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి, రాజంపేట డివిజన్ పరిధిలో పల్నాడు జిల్లాల్లోని నరసారావుపేట, తిరుపతి డివిజన్, నంద్యాల జిల్లాల్లో వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్, డ్రైవర్, అటెండర్ పోస్టులలో వీఆర్‌ఏలతో భర్తి చేయడం జరిగింది. జమ్మలమడుగు డివిజన్ పరిధిలో కూడా ఖాళీగా ఉన్న పోస్టుల్లో వీఆర్‌ఏలతో భర్తి చేయాలని సూచించారు.

వైవీయూలో స్నాతకోత్సవం నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన వర్సిటీ స్నాతకోత్సవం త్వరగా నిర్వహించాలని టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేష్, కార్యదర్శి అక్షయ్ కుమార్‌రెడ్డిలు కోరారు. ఈ విషయమై బుధవారం రిజిస్ట్రార్ పుత్తా పద్మను వైవీయూలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా వైవీయూలో కాన్వొకేషన్ నిర్వహించకపోవడంతో ఎంతో మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని త్వరితగతిన కాన్వొకేషన్ నిర్వహించాలని కోరారు. అలాగే వర్సిటీలో వసతి గృహాల్లో వైఫై ఏర్పాటు చేయడంతోపాటు వసతులను మెరుగు పరచాలని కోరారు.

ఫుట్‌బాల్‌లో కర్నూలు జట్టు విజయం



విజయం సాధించిన కర్నూలు జట్టు

కడప కార్పొరేషన్ : విద్యుత్ సంస్థలో నిర్వహిస్తున్న క్రీడాపోటీలు ఆసక్తికరంగా జరుగుతున్నాయి. బుధవారం సీకేదిన్నె పోలీస్‌స్టేషన్ ప్రక్కనున్న మైదానంలో జరిగిన ఫుట్‌బాల్ ఫైనల్ మ్యాచ్‌లో కడప, కర్నూలు జట్లు తలపడ్డాయి. ఇందులో 2–0 తేడాతో కర్నూలు జట్టు విజయం సాధించింది. ఏపీ ట్రాన్స్ కో చీఫ్ ఇంజినీర్ క్రిష్ణకుమార్, జనరల్ సెక్రటరీ వెంకట సుబ్బయ్య, స్పోర్ట్స్ సెక్రటరీ వీరాంజనేయులు, మస్తాన్, కల్చరల్ సెక్రటరీ వీరభద్రయ్యలు మ్యాచ్‌ను పర్యవేక్షించారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

కడప ఎడ్యుకేషన్ : డ్రగ్స్‌తో జీవితం బుగ్గిపాలు అవుతుందని, డ్రగ్‌కు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండి డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలని ఈగల్ అధికారులు సూచించారు. బుధవారం కడప మండలం ఆలంఖాన్‌పల్లి జిల్లా పరిషత్తు హైస్కూల్లో గంజాయి, డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గంజాయి, ఇతర డ్రగ్స్ కట్టడి చేయడం కోసం ఈగల్ పేరుతో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసిందని తెలిపారు. ఎన్‌డీపీఎస్ చట్టాలు, ఎన్‌డీపీఎస్ చట్టంలోని కఠిన శిక్షల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాలలు, నివాస ప్రాంతాల సమీపంలో ఎక్కడైనా డ్రగ్స్ వినియోగం, గంజాయి విక్రయాలు జరుగుతూ ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1972కు కాల్ చేసి సమాచారాన్ని తెలియ చేయాలన్నారు. సమాచారం తెలిపిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాదక ద్రవ్యాల నివారణలో భాగస్వాములవుతామని ప్రతిజ్ఞ చేయించారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ప్రారంభించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు డా బీ ఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్ ద్వారా కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు పెద్దలపల్లి ప్రభాకర్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.

వానరాల ఆత్మబంధువు చిన్నరంగనాయకులు



చిన్నరంగనాయకులు



కొండముచ్చులకు ఆహారం అందిస్తున్న చిన్నరంగనాయకుల బృందం

చక్రాయపేట : ఆయన పేరు చిన్నరంగనాయకులు. ఊరు ప్రొద్దుటూరు. తపాలా శాఖలో చిరుద్యోగిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందారు. అనంతరం వీరాంజనేయస్వామి దర్శనం కోసం గండికి వచ్చాడు. అక్కడ ఆకలితో అలమటిస్తున్న వానరాలను(కోతులను) చూసి చలించి పోయాడు. వాటి ఆకలి దప్పికలను తీర్చాలని కంకణం కట్టుకుని ప్రొద్దుటూరు నుంచి వారంలో ప్రతి మంగళ, గురు, శని వారాల్లో క్రమం తప్పక అద్దె ఆటోలో ప్రొద్దుటూరు నుంచి పండ్లు తీసుకొచ్చి వానరాలకు ఆత్మ బంధువు అయ్యాడు. ఇలా 13 సంవత్సరాల నుంచి క్రమం తప్పకుండా గండికి వచ్చి వానరాలకు ఆహారం అందించి వెళుతున్నాడు. చిరుద్యోగిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవడంతో తొలుత తన సొంత డబ్బుతో మొదలెట్టిన ఈ కార్యక్రమానికి దాతలను భాగస్వాములను చేశాడు. ఇప్పుడు దాతలను అడిగి మరీ కోతులకు ఆహారం అందిస్తున్న చిన్నరగనాయకులను సాక్షి పలుకరించింది. ఆయన మాట్లాడుతూ భగవంతుడు వానరాలకు ఆకలి తీర్చడానికి తనను భూమి మీదకు తీసుకొచ్చాడేమో అనుకుంటున్నానని అందుకే తాను దాతలను అర్థించి వారిచ్చిన డబ్బుతో పండ్లుకొని వాటికి పెడుతున్నానన్నారు. ప్రస్తుతం వానరాల సంఖ్య కూడా పెరిగింది. వారానికి సుమారు రూ.40 వేల వరకు ఖర్చు వస్తోంది. దాతలు మరింత సహకరిస్తే ఈయజ్ఞం చేస్తూనే ఉంటా. ఇలా చేయడం వల్ల నామనస్సుకు ఎంతో హాయిగా ఉంటోంది. మనసున్న మారాజులు ఎవరైనా 78936 99304 నంబరుకు ఫోన్‌పే ద్వారా సాయం అందిస్తే వారు కూడా ఈయజ్ఞంలో భాగస్వాములు అవుతారని వారి కుటుంబానికి వీరాంజనేయస్వామి ఆశీస్సులు అందుతాయని నేను భావిస్తున్నానన్నారు.

అంగన్‌వాడీ వర్కర్స్ సహకరించాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ ఇన్‌చార్జి అధికారి స్వర్ణలత

వేంపల్లె : అంగన్‌వాడీ వర్కర్స్‌లకు చెందిన సెల్‌ఫోన్ సమస్యను ఐసీడీఎస్ జిల్లా ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్తానని కాబట్టి అంగన్‌వాడీ వర్కర్స్ అందరూ సహకరించి సెల్‌ఫోన్‌లను తీసుకెళ్లాలని వేంపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు ఇన్‌చార్జి అధికారి స్వర్ణలత తెలిపారు. బుధవారం ఐసీడీఎస్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ వేంపల్లె ప్రాజెక్టు పరిధిలో ఉన్న అంగన్‌వాడీ వర్కర్స్ అందరూ సెల్‌ఫోన్ లు సరిగా పనిచేయడంలేదని ప్రాజెక్టు కార్యాలయంలో పెట్టి వెళ్లిపోవడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి కూడ తీసుకెళ్లామని, కొత్త సెల్‌ఫోన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం దృష్టి తీసుకెళ్లామన్నారు. అంగన్‌వాడీల సెల్‌ఫోన్ల సమస్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. కాబట్టి కొత్త సెల్‌ఫోన్లు వచ్చే వరకు ప్రస్తుతం పాత సెల్‌ఫోన్లను తీసుకెళ్లి వీలైనంత వరకు పనిచేయాలన్నారు. సెల్‌ఫోన్ల సమస్య త్వరితగతిన పరిష్కారమవుతుందన్నారు.

కాంట్రాక్టు కార్మికులను వేదిచడం తగదు



మిట్టమీదపల్లె సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

పెండ్లిమర్రి : విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను వేధిచడం, అవినీతికి మారు పేరుగా నిలిచిన పెండ్లిమర్రి సెక్షన్ విద్యుత్ జూనియర్ ఇంజనీర్ శివకుమార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నాగసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మిట్టమీదపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడలేని విధంగా పెండ్లిమర్రి సెక్షన్ జూనియర్ ఇంజనీర్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల పట్ల దురుసుగా ప్రవర్తిచడం, వేధింపులకు గురిచేయడం చేస్తున్నారన్నారు. ఏదైనా ఉద్యోగి తప్పుచేస్తే వారికి నోటీసులు ఇచ్చి వివరణ తీసుకొని వేతనాలు కట్ చేయాలి కాని జూనియర్ ఇంజనీర్ మాత్రం ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తున్నాడన్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి ఇతనిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శిబాదుల్లా, ఏఐటీయూసీ నాయకులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడి అమానుషం

వల్లూరు(చెన్నూరు) : ఓడిపోతామని భయంతో దాడులకు తెగబడుతున్న తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రజలకు మేలు చేసి ఉంటే ఎందుకు భయపడుతున్నారని వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎర్రసాని నిరంజన్‌రెడ్డి అన్నారు. వైఎస్‌ఆర్‌సీపీ ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై టీడీపీ గూండాలు దాడి చేయడం అమానుషమని ఆయన అన్నారు. వారు ప్రజలకు మేలు చేయలేదు కాబట్టే వైఎస్‌ఆర్‌సీపీ నాయకులపై దాడులు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉమామహేశ్వర్‌రెడ్డి, చిన్నబాబు, మిట్టా కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం..

కొండాపురం : పులివెందుల మండలం జెడ్పీటీసీ ఉప ఎన్నికల ప్రచారంలో ఎన్నికల ప్రచారానికి హాజరైన ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌పై తెలుగుదేశం కార్యకర్తలు దాడి చేయడం దారుణమని జమ్మలమడుగు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు జె.ప్రవీణ్‌యాదవ్ అన్నారు. రాష్ట్రంలో బీసీలపై దాడిని ఖండిస్తున్నామన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో షంసుద్దీన్

వల్లూరు : విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా విద్యా శాఖాధికారి షంసుద్దీన్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. సాంబారు పలుచగా వుండడాన్ని గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల మెనూ మేరకు మంచి భోజనాన్ని అందించాలని ఆదేశించారు. పాఠశాల ఆవరణను పరిశీలించి, ఆవరణను పరిశుభ్రంగా వుంచాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలోని దెబ్బతిన్న ఓవర్ హెడ్ ట్యాంకును పరిశీలించి త్వరలో దాన్ని తొలగించడానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతులకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.



టీడీపీ నేతల దాడులకు నిరసనగా శాంతి యుతంగా పార్టీ కార్యాలయం నుంచి డీఎస్పీ కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీలు, పార్టీ జిల్లా అధ్యక్షులు, పార్టీ నేతలు



పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో నల్లగొండువారిపల్లి వద్ద టీడీపీ నేతల దాడులలో గాయపడిన ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌ను ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్సీ సతీష్‌రెడ్డి